

# కథ మారుతుంది

## —గంటి రమాదేవి

"వచ్చిందా?"
"బయట వుంచి వచ్చాను"
"ఎలా వుంది?"
"బంగినపల్లి మామిడిపండు"
"అది సరే! ఏమైనా చదువుకుందా?"
"దీనికి చదువెందుకు? చూస్తారుగా మొగలిపువ్వు"
"ఎంత?"
"చెప్పానుగా!"
"అది కాక, ఇదనీ అదనీ అంటూంటారు"
"ఇంకో యాభై అవుద్ది"
"నేననుకున్నాను. ఇంద మూడు వందల యాభై. రాత్రంతా అక్కర్లేదు"
"మీ ఇష్టం"

* * *

"నీ పేరు?"
"జయమంజు"
"అసలు పేరు"

**భయపడకు. నేను డబ్బులు తిరిగి తీసుకోనులే. అసలు నీతో మాట్లాడాలనే ఈ ఏర్పాటు చేశాను. పైపై మెరుగుల జిలుగు బట్ట తొలగించి, మీ అసలు స్వరూపం తెలుసుకుందామనే జిజ్ఞాసతో వచ్చాను. అఫ్‌కోర్సు, దీనికి పెట్టుబడి మా పత్రికదే.**

"సావిత్రి ఇంట్లో చిట్టీ అంటారు"
"నీకు అమ్మా నాన్నా వున్నారా?"
"అమ్మా, నాన్నా, ఇద్దరు అన్నయ్యలు, ముగ్గురు అక్కలు"
"నీ వయస్సు"
"పద్దెనిమిది"
"ఈ బిజినెస్సులో ఎన్నాళ్ళుగా వున్నావు?"
"నాలుగేళ్ళు"
"అంటే పద్నాలుగేళ్ళకే. కారణం"
"చెప్పాలంటే చాలా వుంది"
"నాకు తెలుసు. నేను ఓ వారపత్రిక సబ్—ఎడిటర్ని. మీలాంటి వాళ్ళ జీవితాలలో వుండే విషాదం, కన్నీళ్ళు, లేమి, ప్రేమంటే నోచుకోని, ప్రేమంటే తెలియని నిరాశా జీవిత చక్రాలు... ఆ... ఆ...
ఆ... చక్రాలు... మీ నికృష్ట జీవితాల గురించి రాస్తే ఎన్నో సంచికలూ, సంపుటాలు అవుతాయి. మురికివాడల్లో మీ బతుకులు, కన్ను తెరవకముందే దరిద్రమనే దుర్భర తిమిరం..."

"వస్తారా. పొద్దుపోతోంది..."
"అప్... అప్... అది... అదీ తొందరెందుకు. ముందు మాట్లాడుకుని"
"తర్వాత మాట్లాడుకోవచ్చు. ఇది ముగిస్తే..."
"భయపడకు. నేను డబ్బులు తిరిగి తీసుకోనులే. అసలు నీతో మాట్లాడాలనే ఈ ఏర్పాటు చేశాను. పైపై మెరుగుల జిలుగు బట్ట తొలగించి, మీ అసలు స్వరూపం తెలుసుకుందామనే జిజ్ఞాసతో వచ్చాను. అఫ్‌కోర్స్, దీనికి పెట్టుబడి మా పత్రికదే. నీ గురించి పత్రికలో వ్యాసం రాయాలి. కొన్ని ప్రశ్నలడుగుతాను. సమాధానాలు సూటిగా చెప్పాలి. నీకు విసుగ్గా వున్నట్టుంది. ఏం చేస్తాం అది నా డ్యూటీ. ముందు నీ బాల్యం, యవ్వనం, ఈ రంగంలోకి ఎలా వచ్చావ్. ఏ తుచ్ఛ మగపురుగు నిన్ను దీన్లోకి దింపాడు, ఏ వెధవ నిన్ను లవ్‌లోకి దింపి మోసం చేసి, ఎంగిలాకులా నిన్ను వదిలేసి, విధిలేక నువ్వీ నరకకూపంలోకి వచ్చేటట్టు చేశాడు. ఇవన్నీ ఒక్కొక్కటి చెప్పాలి. ముందు ప్రశ్న. నీ బాల్యం గురించి చెప్పు. నీకు తిండికి బట్టకి కరువుంది. అవునా."
"లేదు. నాకు కావలసిన బట్టలు, తిండి శుభ్రంగా పుష్కలంగా వుండేవి మా ఇంట్లో".
"ఆప్... ఊ... ఓ... అలాగా... మరి నీకు ఇంట్లో ప్రేమ కొరవడి వుంటుంది. నీకు సవతి తల్లి..." "మా అమ్మ ఒక్కతే మా నాన్నకు"
"అన్నలు... అక్కలు"
"నేను ఆఖరిదాన్ని కాబట్టి మా అన్నయ్యలకు, అక్కలకు నేనంటే చాలా ఇష్టం.'
"మరి... మరి... నిన్నీ రంగంలోకి దింపిన ఆ దుష్టశక్తులూ, లేదా ఆ విచిత్ర పరిస్థితులేమిటి?"
"అటువంటిదేం లేదన్నా కదా? నా అంతట నేనే చేరాను దీన్లో..."
"ఎందుకు... పెళ్ళవదని భయమా? కట్నం ఇచ్చుకోలేమనా? మెరుగు తీగలా వున్నావు. చదువుంది. మరి"
"ప్చ్... సరే... స్కూలు చదువు కష్టమనిపించి..."
"అదేం లేదు. చాలా తేలిగ్గా పాసయ్యాను పదోతరగతి. ఇంటర్ పాసయ్యాను"
"ఆ తెలిసింది. అప్పుడు అలవాటయి వుంటుంది. మత్తుపదార్థాలు సేవనం స్నేహితులతో జల్సా కాలక్షేపాలు. దానికి డబ్బు అవసరమయి"
"అదేం లేదు. నా కసలు అవంటే గిట్టవు"
"మా నాన్న కట్నం ఇచ్చుకోలేనంత అధ్వాన్న పరిస్థితిలో లేదు."
"అయితే... అయితే... మరీ వెధవ అధ్వాన్న వృత్తిలో..."
" నా వృత్తిని అవమానిస్తే సహించను"
"సారీ... బాగా కోపం వచ్చినట్టుంది. చెప్పానుగా. మా పత్రిక్కి నీ కథ కావాలని. మరి నువ్వు ఎందుకొచ్చావు దీంట్లోకి"
"ఇంటర్ ప్యాసయిన తర్వాత ఏం చేస్తారు?"
"అది వారి వారి ఇష్టాల మీద ఆధారపడి వుంటుంది"
"మీకు తెలిసినవి చెప్పండి?"
"కొంతమంది పెళ్ళి చేసుకుంటారు?"
"ఊ..."
"కొంతమంది డిగ్రీ చదువుకుంటారు"
"ఊ..."
"మరి కొంతమంది వృత్తి విద్య నేర్చుకుంటారు"
"ఏం నేర్చుకోకుండా చేసే వృత్తి ఇదే కదా?!"

* * *

"ఛీఛీ... ఏం చేసుకొచ్చావయ్యా! అయిదొందల దండుగ. ఇంటర్వ్యూ చేయమంటే ఇలాగా. ఏదీ దీంట్లో సానుభూతి, సామాజిక స్పృహ! మనకలాటివి కావాలి. సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఈ కేన్సర్‌ను గురించి ప్రజలకు తెలియజెప్పాలి"
"నాతో అలాగే చెప్పింది. నేనేం చెయ్యను! ఈ పత్రిక్కి పెద్ద కాబట్టి మీరే..."
"అంటే... ఏమిటి నీ ఉద్దేశం. నన్నేళ్ళంటావా?"

* * *

"వచ్చిందా?"
"బయటవుంచి వచ్చాము"
"ఎలా వుంది?"
"బంగినపల్లి మామిడిపండు"

"పేరు జయమంజు"
"అదే కావాలన్నారు కదా?"
"మా వాడితో ఏదేదో చెప్పిందట. అదెలా వీలవుతుంది. అలా వుండటానికి వీల్లేదు"
"నేను అన్నీ చెప్పావండీ..."
"పంపించు"

"ఆ... అది... చావక ముందు..."
"ఆల్ రైట్... తర్వాత..."
"దారిద్ర్యంతో పాటే పెరిగాను. అన్నలు, అక్కలు నన్ను ఛీదరించుకునేవారు. ఇంతలో నాకు వయస్సు వచ్చింది"
"ఒక మోసగాడు నన్ను ప్రేమించానన్నాడు"
"అవును. మీకెలా తెలుసు?"



* * *

"నీ పేరు?"
"జయమంజు"

"అసలు పేరు?"
"సావిత్రి ఇంట్లో చిట్టీ అంటారు"
"నీకు అమ్మా నాన్నా"
"నాదో విషాదగాథ... అమ్మా నాన్నా నే పుట్టకముందే చనిపోయారు"
"పుట్టక ముందేనా?"
"ఆ... పుట్టాకే... మర్చిపోయాను. తాగడానికి పాలులేవు. కట్టుకోడానికి బట్టలులేవు. మా నాన్న తాగొచ్చి మా అమ్మను కొట్టేవాడు"
"వాళ్ళు చచ్చిపోయారన్నావ్?"
"తర్వాత చెప్పు"
"నా సర్వస్వం అతని కప్పగించాను. నేను నెల తప్పాను. అన్నయ్యలు చావబాదారు. అక్కలు కుళ్ళబొడిచా రు. విధిలేక బజారున పడి ఇలా..."
"గుడ్..."

* * *

"ఎవడు వీడు?"
"నిన్న వచ్చిన పిచ్చాడి బాస్"
"నిన్న చెప్పిన కథ బాలేదా?"
"అందుకనేగా వీడొచ్చింది"
"సర్లే... అప్పనంగా ఆరొందలు సంపాదించాం"
"అప్పుడప్పుడు ఇలాంటోళ్ళు వస్తుంటారు"
"మామా..."
"చెప్పు పిల్లా..."
"మనిద్దరం భార్యాభర్తలమని వాళ్ళకి తెలిస్తే..."
"అప్పుడు కథ మారుద్దాం" *